సాక్షి
ములుగు
బుధవారం । 13 । మార్చి । 2024



సహకార చట్టంపై అవగాహన ఉండాలి

- 8లో▸

పీఏసీఎస్ సంఘాల డైరెక్టర్లు సహకార చట్టంపై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు అన్నారు.



విద్యుత్ శాఖలో మహిళల పాత్ర అద్వితీయం

- 8లో▸

విద్యుత్ శాఖలో మహిళల పాత్ర అద్వితీయమని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.3°/21.4°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి కాస్త చలి తీవ్రత ఉంటుంది.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహర్
	బుధ	గురు
	6:31	5:03


న్యూస్‌రీల్

రామప్పను సందర్శించిన అమెరికా విద్యార్థులు



వెంకటాపురం(ఎం): ప్రపంచ వారసత్వ సంపదగల రామప్ప దేవాలయాన్ని అమెరికాకు చెందిన విద్యార్థులు జోష్, బ్రేట్, యోషి, నటాశా, మిగేల్, బార్బా, ఎలియానా, డెస్నీ, జామీయోలు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రామప్ప రామలింగేశ్వరున్ని దర్శించుకొని ఆలయ విశిష్టత గురించి గైడ్ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన తాము ఇండియాలోని పురాతన కట్టడాలపై పరిశోధన చేసేందుకు వచ్చినట్లు వారు వెల్లడించారు.

సమ్మక్కసాగర్ బ్యారేజీ గేట్ల మూసివేత



కన్నాయిగూడెం: మండల పరిధిలోని తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన సమ్మక్క సాగర్‌బ్యారేజీ గేట్లను అధికారులు మంగళవారం పూర్తిగా మూశారు. బ్యారేజీలో 59 గేట్లు ఉండగా గత కొన్నిరోజుల నుంచి 58 గేట్లు మూసి ఒక గేటు ద్వారా నీటిని దిగువకు వదిలారు. మంగళవారం 59వ గేటును కూడా మూసివేసి పూర్తిగా బ్యారేజీలోకి వచ్చిన నీటిని స్టోరేజీ చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజీలోకి 1,330క్యూసెకుల నీరు ఎగువ నుంచి వచ్చి చేరుతోంది. బ్యారేజీ సామర్థ్యం 83 మీటర్లు ఉండగా ప్రస్తుతం 74.75 మీటర్ల నీటిమట్టం ఉంది.

ఉద్యమంతోనే గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు



ఎస్ఎస్ తాడ్వాయి: ఉద్యమ పోరాట ఫలితంగా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు అయిందని జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, మేడారం ట్రస్ట్ బోర్డు డైరెక్టర్ ముంజాల భిక్షపతిగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన మేడారంలోని సమ్మక్క– సారలమ్మలను దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన చట్టంలో పేర్కొన్న హామీ ప్రకారం గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సీతక్క కూడా గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు చేస్తున్న ఉద్యమానికి సంపూర్ణ మద్దతు పలికిందన్నారు.

గ్యాస్ లీకేజీతో మంటలు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని 12వ వార్డులో తాండ్రి సతీష్ ఇంటి వద్ద గ్యాస్ లీకేజీ కావడంతో మంటలు వ్యాపించాయి. గమనించిన చుట్టు పక్కల వారు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చి మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఫైర్ సిబ్బంది ఆశీష్, రాజేందర్, రాజు చేరుకొని మంటలు ఆర్పివేయడంతో పాటు సామగ్రిని బయటకు తీశారు. ఎలాంటి నష్టం జరగలేదని బాధితుడు సతీష్ తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని కరపత్రాల పంపిణీ

ఏటూరునాగారం: ఏటూరునాగారం డివిజన్ పరిధిలోని ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఏటూరునాగారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ చిన్న అన్నారు. మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్లు అడ్మిషన్లు పెంచేందుకు వాజేడు, మంగపేట జూనియర్ కళాశాలల వద్ద విద్యార్థులకు కరపత్రాలను అందజేశారు. అనంతరం చిన్న మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో చేరితే ఉచితంగా విద్యా అందుతుందని తెలిపారు. ప్రైవేట్ కళాశాలల్లో చేరి అధిక ఫీజులు కట్టి మోసపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విజయలక్ష్మీ, నవీన్, రమేష్, సంపత్ పాల్గొన్నారు.

చెరువుల కింద నీటి లభ్యత

కళకళలాడుతున్న వరిపంట

- రామప్పలోకి దేవాదుల, లోకం చెరువుకు ఎస్సారెస్పీ నీరు
- లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మారుమూల పంట పొలాలకు నీళ్లు
- పలుచోట్ల బోరుబావుల కింద పంటలకు తప్పని తిప్పలు



రామప్పలోకి చేరుతున్న దేవాదుల నీరు

ములుగు: జిల్లాలో యాసంగి పంట సాగు సాఫీగా సాగుతోంది. ఎండల ప్రభావంతో భూ గర్భ జలాలు పడిపోయి బోరుబావుల కింద సాగవుతున్న పంటలతో కొంతమంది రైతులు ఇబ్బందులు పడుతున్నా.. ప్రధాన చెరువుల కింద ముందస్తుగా ఖరారు చేసిన తైబందీకి మాత్రం ఎటువంటి ఆటంకాలు లేవు. కొన్ని ప్రాంతాల్లో వరి పంట కంకి, మరికొన్ని ప్రాంతాల్లో చిరు పొట్ట దశలో ఉంది. చెరువుల కింద నీటి లభ్యత అనుకూలంగా ఉండడంతో రైతులు ధైర్యంగా పంట సాగు చేశారు. అధికారికంగా జిల్లా వ్యాప్తంగా 46వేల ఎకరాల్లో రైతులు యాసంగిలో వరిసాగు చేశారని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేసినా అంతకు మించి సాగైన పరిస్థితులు ఉన్నాయి.

అండగా దేవాదుల నీరు

జిల్లాలో అతిపెద్ద జలాశయం రామప్ప. నిత్యం నీటి నిల్వతో కళకళలాడుతోంది. గోదావరి నదిపై నిర్మించిన దేవాదుల ప్రాజెక్టు మొత్తం నీటిమట్టం 83 మీటర్లు ఉంటే ప్రస్తుతానికి 74.75 మీటర్ల నీటిమట్టం ఉంది. దీంతో దేవాదుల నుంచి భీం గణపురంకు అక్కడి నుంచి రామప్ప జలశయానికి నీటిని మళ్లిస్తున్నారు. నిత్యం 25 నుంచి 30 ఫీట్ల నీరు ఉండేలా చూస్తున్నారు. దీంతో ఈ ఏడాది అధికారికంగా 5,350 ఎకరాలు అనధికారికంగా మరో 5వేల ఎకరాల్లో సాగు అయినట్లు తెలుస్తోంది. దీంతో పాటు రామప్ప నుంచి నర్సంపేట, పాకాల వంటి ప్రాంతాలకు నీటి సరఫరా జరుగుతుంది. రైతుల అభ్యర్థన మేరకు ఇటీవల ములుగు మండలంలోని మాన్‌సింగ్ తండా లిఫ్ట్ ఇరిగేషన్ పాయింట్ నుంచి మారుగ్రామాల్లో సాగు అవుతున్న వరి పంటకు మంత్రి సీతక్క నీటిని విడుదల చేశారు. కొడిశలకుంట, గుర్తూరుతండా, రామచంద్రాపురం, ముద్దునూరుతండా, మాన్‌సింగ్‌తండా వంటి గ్రామాల్లోని పంటలకు నీటిని అందించడానికి అధికారులు కసరత్తు పూర్తి చేశారు.



గింజపాలు పోసుకునే దశకు చేరిన వరి

లోకం చెరువు రైతులకు కాల్వ నీరు

పర్కాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ప్రయత్నంతో ఎస్సారెస్పీ కాల్వ నీటిని విడుదల చేశారు. రేగొండ మీదుగా వస్తున్న డీబీఎం–38 కాల్వ నీటిని పానేస వద్ద నుంచి లోకం చెరువుకు మళ్లించారు. కాల్వను శుభ్రం చేస్తే కాశిందేవిపేట, పంచోత్కులపల్లి, కొత్తూరు, రాయినిగూడెం, అంకన్నగూడెం, సర్వాపురం, కన్నాయిగూడెంలోని చెరువులను నింపుకునే అవకాశం ఉంది. రైతుల డిమాండ్ మేరకు లోకం చెరువుకింద సాగులో ఉన్న వరికి నీటిని అందించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఏజెన్సీలో బోరుబావుల కింద..

ములుగు ఏజెన్సీలో మల్లూరు, పాలెం ప్రాజెక్టులు ప్రధానమైనవి. ఈ రెండు చెరువుల కింద కాల్వలు సరిగా లేకపోవడంతో అధికారులు అధికారికంగా తైబందీ ఖరారు చేయలేదు. అయినప్పటికీ పాలెం కింద 2వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. మంగపేట, ఏటూరునాగారం, ఎస్ఎస్ తాడ్వాయి, వాజేడు, కన్నాయిగూడెం మండలాల్లో బోరుబావుల కింద 15 నుంచి 20వేల ఎకరాల పంట సాగవుతోంది.



లక్నవరం సస్పెన్షన్ బ్రిడ్జి వద్ద నీటి నిల్వ

లక్నవరం కింద కోట కాల్వకు..

ఈ ఏడాది మేడారం మహాజాతర సందర్భంగా లక్నవరం నీటిని జంపన్నవాగుకు విడుదల చేయడంతో తైబందీ పరిధిని తగ్గించారు. ప్రస్తుతం చెరువులో 22 ఫీట్ల మేర నీటి నిల్వ ఉంది. అధికారికంగా 2,100 ఎకరాల్లో, అనధికారికంగా మరో 3వేల ఎకరాల్లో వరి సాగు అవుతుంది. కొంత మంది కాల్వకు గండి కొట్టి నీటిని మళ్లించుకుంటున్నారని కోట కాల్వ చివరి ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నా.. ఉన్న నీటితో పంట చేతికి వస్తుందని రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. అధికారులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించి అండగా ఉండాలని రైతులు కోరుతున్నారు. గతంలో రామప్ప నుంచి లక్నవరం చెరువు వరకు మంజూరైన గ్రావిటీ కెనాల్ పనులు త్వరితగతిన పూర్తయితే లక్నవరం సైతం నిత్యం నీటినిల్వతో కళకళలాడే అవకాశం ఉంది.

తగ్గుముఖం పడుతున్న జ్వరాలు

- డీఎంహెచ్‌ఓ అప్పయ్య

సాక్షి స్పందన



రోగిని పరీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

వాజేడు: గుమ్మడి దొడ్డిలో ప్రబలిన విషజ్వరాలు తగ్గుముఖం పడుతున్నాయని, వారం రోజుల్లో పూర్తిగా అదుపులోకి వస్తాయని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య తెలిపారు. 'సాక్షి'లో మంగళవారం విజృంభిస్తున్న విషజ్వరాలు కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన డీఎంహెచ్‌ఓ గుమ్మడిదొడ్డిలో జ్వరాలతో బాధపడుతున్న ఇళ్లకు వెళ్లి ప్రతీఒక్కరిని పరామర్శించారు. వారి నుంచి జ్వరాలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జ్వర పీడితులకు భరోసా కల్పించారు. జ్వరాలపై ఆందోళన చెందాల్సిన పని లేదని సూచించారు. గ్రామంలో తిరుగుతూ నిల్వ ఉన్న నీటిని తొలగించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జ్వరం వచ్చిన వారు భౌతిక దూరం పాటించడంతో పాటు తప్పనిసరిగా మాస్క్ ధరించాలన్నారు. అనంతరం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కోవిడ్ సమయంలో చూసిన వైరస్ లాగానే చాలా వైరస్‌లు ఉంటాయని తెలిపారు. ఆర్థోరైడిస్ వైరస్ కారణంగా గుమ్మడి దొడ్డి ప్రజలకు జ్వరాలు వస్తున్నట్లు తెలిపారు. గ్రామం నుంచి 30మంది శాంపిల్స్ పరీక్షలకు పంపించగా ఏ ఒక్కరికి కూడా చికున్‌గున్యా, డెంగీ, టైఫాయిడ్ లాంటి జ్వరాలు లేవని తెలిసిందని వివరించారు. వారం రోజుల్లో జ్వరాలు పూర్తిగా తగ్గుముఖం పట్టేలా చూస్తామన్నారు. ప్రస్తుతం గుమ్మడిదొడ్డిలో 4, సుందరయ్య కాలనీలో రెండు, ఇప్పగూడెంలో రెండు యాక్టివ్ కేసులు ఉన్నాయని తెలిపారు. గ్రామంలో తాగునీటి పరీక్షలు చేసి పరిశీలించామని ఏ విధమైన సమస్య లేదన్నారు. రోజు వారీగా పరీక్షలను చేయడంతో పాటు మందులను అందిస్తామని వెల్లడించారు. డీఎంహెచ్‌ఓ వెంట వైద్యులు మధుకర్, అభినయ్ ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

కలెక్టర్ ఇలా త్రిపాఠి



పోషకాహార పదార్థాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కన్నాయిగూడెం: పౌష్టికాహారంతోనే సంపూర్ణం ఆరోగ్యం సాధ్యమని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పోషణ పక్షోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని చింతగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి హాజరయ్యారు. పోషకాహారం పదార్థాలను పరిశీలించి అంగన్‌వాడీ టీచర్లను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు, బాలింతలు, గర్భిణులకు పోషకాహార పదార్థాలను అందించాలన్నారు. ఏజెన్సీలో ప్రజలు సమతుల ఆహారం తీసుకోకపోవడం వల్లే రక్తహీనత వంటి ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. పోషన్ అభియాన్ ద్వారా అందిస్తున్న ఆహార పదార్థాలు తీసుకోవడంతో అనారోగ్య సమస్యలు దరిచేరవని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కిచెన్ గార్డెన్‌లను పెంచుకోవాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంఆర్‌సీ భవనంలో ఏర్పాటు చేసిన మండల స్థాయి సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. మండలంలో నెలకొన్న సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలం ప్రారంభం కావడంతో ఎక్కడా నీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులకు సూచించారు. అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమయ పాలన పాటించి ప్రజలకు సేవలందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి స్వర్ణలత లెనిన, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, సీడీపీఓ హేమలత, మండల ప్రత్యేకాధికారి, ఏపీడీ వెంకటనారాయణ, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ సుజాత, మండల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ గూటికి అరూరి!

బీఆర్ఎస్‌కు భారీ షాక్

- హైదరాబాద్‌లో కేంద్రమంత్రి అమిత్‌షాతో భేటీ
- బీఆర్ఎస్‌కు, జిల్లా అధ్యక్ష పదవికి నేడు రాజీనామా తర్వాత కమలం పార్టీలో చేరే అవకాశం
- ఆ పార్టీ వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ప్రకటన?



సాక్షిప్రతినిధి, వరంగల్ : వరంగల్‌లో బీఆర్ఎస్‌కు షాక్‌ల మీద షాక్‌లు తగులుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు త్వరలో షెడ్యూల్ రానున్న నేపథ్యంలో కీలక నేతలు ఒక్కొక్కరు పార్టీని వీడుతున్నారు. గులాబీ పార్టీకి చెందిన స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య రాజీనామా చేసి సీఎం రేవంత్‌రెడ్డి, దీపాదాస్‌మున్షీ తదితరులను కలిశారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, కొందరు పీఏసీఎస్ చైర్మన్లు కూడా కాంగ్రెస్ గూటి కి చేరారు. తాజాగా, మంగళవారం వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ ఆ పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించిన బీజేపీ బూత్‌స్థాయి అధ్యక్షుల విజయ సంకల్పసభకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా హాజరయ్యారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నాయకులు మార్తినేని ధర్మారావు తదితరులతో అరూరి రమేష్ హైదరాబాద్ ఐటీసీ కాకతీయ హోటల్‌లో అమిత్‌షాను కలిశారు. కొద్దిసేపు ఏకాంతంగా మాట్లాడిన అనంతరం బీజేపీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేసినట్లు సమాచారం.

బీఆర్ఎస్ నేతల తీరుపై అసంతృప్తితోనే..

బీఆర్ఎస్‌లో కీలకంగా మారిన కొందరు నేతల తీరుపై అసంతృప్తితోనే అరూరి రమేష్ బీజేపీ తీర్థం పుచ్చుకునేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పార్టీలోనే ఉంటూ ద్రోహం చేసిన వారే ఇప్పుడు మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆవేదన చెందినట్లు తెలుస్తోంది. అందుకే పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఎంపీ టికెట్ ఇస్తామని చెబుతూనే తనకు వ్యతిరేకంగా మాట్లాడుతున్న వారిని కనీసం నియంత్రించడం లేదని సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. కష్టకాలంలో ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తట్టుకుంటున్న తనను జిల్లాకు చెందిన ఒక నాయకుడు నిత్యం సూటిపోటి మాటలతో వేధిస్తున్నాడని, పార్టీ శ్రేణుల వద్ద తన ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నాడంటూ పేర్కొన్నారు. అధిష్టానానికి నివేదించినా కట్టడి చేసే ప్రయత్నం చేయలేదని మనస్తాపం చెందిన ఆయన.. ఈ పరిణామాల నేపథ్యంలో బుధవారం తన అనుచరులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనుండటం బీఆర్ఎస్ వర్గాల్లో కలకలం రేపుతోంది.

రాజీనామాకు కారణాలు నేడు వెల్లడి..

ఐటీసీ కాకతీయ హోటల్‌లో అమిత్‌షాతో భేటీ అయిన అరూరి రమేష్.. అ తర్వాత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో కూడా సుమారు అరగంట ఏకాంతంగా మాట్లాడినట్లు సమాచారం. బీజేపీలో చేరేందుకు సిద్ధమైన ఆయన ఈ మేరకు బీఆర్ఎస్‌కు, వరంగల్ జిల్లా అధ్యక్ష పదవికి బుధవారం రాజీనామా చేయనున్నారు. ఉదయం ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసి తన రాజీనామాకు కారణాలు, పూర్తి వివరాలను ప్రకటించనున్నట్లు తెలిసింది. అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నుంచి పోటీచేసి ఓటమి చెందిన ఆయన వరంగల్ ఎంపీగా పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలోనే బీజేపీ టికెట్ ఇచ్చేందుకు సిద్ధం కావడంతో మొదట కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో చర్చలు జరిపి ఆ తర్వాత అమిత్‌షాను కలిసినట్లు చెబుతున్నారు. ఈ సందర్భంగా అమిత్ షా బీజేపీలోకి అరూరి రమేష్‌ను ఆహ్వానించినట్లు తెలిసింది.

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వీసీకి హాజరైన కలెక్టర్, ఐటీడీఏ పీఓ, అదనపు కలెక్టర్

ములుగు: పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. ఈ మేరకు స్వీప్ కార్యక్రమాల నిర్వహణ, పెండింగ్ ఓటరు దరఖాస్తులు వంటి అంశాలపై ఆయన హైదరాబాద్ నుంచి మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా తరపున కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సీహెచ్. మహేందర్ జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బందికి శిక్షణ వంటి తదితర అంశాలపై అధికారులు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో ఆర్డీఓ సత్యపాల్‌రెడ్డి, డీఆర్డీఓ శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'రిజిస్ట్రేషన్'కు..అద్దెభారం!

శాశ్వత భవనాలకు నోచుకోని కార్యాలయాలు

- ఉమ్మడి జిల్లాలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- ఎనిమిది ఆఫీసులు అద్దెభవనాల్లోనే..
- వరంగల్ ఆర్వోకు స్థలం ఇచ్చి వెనక్కి తీసుకున్న వైనం
- సొంత భవనాలపై అధికారులతో రిజిస్ట్రార్ సమావేశం
- స్థల సేకరణకు కలెక్టర్‌కు అర్జీ పెట్టాలని నిర్ణయం



అద్దె భవనంలో కొనసాగుతున్న వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయం

కాజీపేట అర్బన్ : రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలోని పలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడంతో అద్దెభారం తడిసిమోపడవుతోంది. భూ క్రయ, విక్రయ దస్తావేజుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఖజానాకు ప్రత్యేక ఆదాయవనరుగా శాఖ నిలుస్తోంది. కానీ సొంత భవనాలకు లేక అద్దెభవనాల్లో అరకొర సౌకర్యాలతో అధికారులు, సిబ్బంది సతమతమవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా ఎనిమిది భవనాలకు ప్రతి నెలా ప్రభుత్వం రూ.1,63,863 అద్దె చెల్లిస్తోంది.

ఎనిమిది అద్దెకు.. నాలుగు సొంత భవనాల్లో

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎనిమిది అద్దె భవనాల్లో , నాలుగు సొంత భవనాల్లో కొనసాగుతున్నాయి. వరంగల్ ఆర్వో, భీమదేవరపల్లి, నర్సంపేట, వర్ధన్నపేట, స్టేషన్ ఘన్‌పూర్, కొడకండ్ల, ములుగు, భూపాలపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో కార్యకలాపాలు నిర్వర్తిస్తున్నాయి. కాగా వరంగల్ రూరల్, వరంగల్ ఫోర్ట్, మహబూబాబాద్, పరకాల టీఎన్జీఓస్ భవన్‌లో కొనసాగుతున్నాయి.

స్థలం ఉన్నా.. బడ్జెట్ సున్నా..

భీమదేవరపల్లి, జనగామ, కొడకండ్ల, ములుగు, నర్సంపేట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు ఇప్పటికే సొంత భవనాల నిర్మాణానికి స్థలాలు సేకరించగా వాటి నిర్మాణాల వైపు అడుగుపడలేదు. స్థలం ఉన్నా, బడ్జెట్ కేటాయింపు లేకపోవడంతో ఎలా భవనాలను నిర్మించాలని అధికారులు వాపోతున్నారు.

వరంగల్ ఆర్వోకు ఇచ్చినట్టే ఇచ్చి..

వరంగల్ ఆర్వో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి పదేళ్ల క్రితం ప్రభుత్వం స్థలం కేటాయించింది. దీంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. కాగా 'కుడా' అధికారులు తమ భవన నిర్మాణానికి స్థలం అవసరం ఉందని ఇచ్చినట్టే ఇచ్చి వెనక్కి తీసుకున్నారు.

శాశ్వత భవనాలకు స్థల సేకరణ.. కలెక్టర్‌కు అర్జీ

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని, ఇందుకు స్థల సేకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తెలిపింది. దీంతో వరంగల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా సబ్ రిజిస్ట్రార్లతో జిల్లా రిజిస్ట్రార్ హరికోట్ల రవి విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. శాశ్వత భవనాల నిర్మాణ స్థల సేకరణకు చర్యలు చేపట్టడంపై చర్చించినట్లు సమాచారం. కార్యాలయాలకు అవసరమైన స్థలం సేకరించాలని ఆయా సబ్ రిజిస్ట్రార్లు జిల్లాల కలెక్టర్లకు అర్జీ పెట్టాలని నిర్ణయించారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నెలవారీ అద్దె ఇలా.. (రూ.లలో)

వరంగల్ ఆర్వో	84,651
భీమదేవరపల్లి	6,147
నర్సంపేట	24,463
వర్ధన్నపేట	6,550
స్టేషన్ ఘన్‌పూర్	3,754
కొడకండ్ల	3,294
ములుగు	18,000
జేఎస్ భూపాలపల్లి	17,004

నీటి వసతులపై దృష్టి సారించాలి

ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా

మంగపేట: ఆశ్రమ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మూత్రశాలలకు నీటి వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీఓ చిత్రామిశ్రా ఆదేశించారు. మండల పరిధిలోని చుంచుపల్లి బాలికల, బ్రాహ్మణపల్లి గిరిజన బాలుర వసతి గృహాలను పీఓ డీడీ పోచంతో కలిసి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా ఆశ్రమ పాఠశాలల్లో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకోవడంతో పాటు విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఆర్వో ప్లాంట్ల పనితీరును ఆయా పాఠశాలల హెచ్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ మరగుదొడ్లలో నీటి కుళాయిలు ఉండేలా చూడాలన్నారు. బాలికల హాస్టళ్లలో టాయిలెట్ల వద్ద డస్ట్‌బిన్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని గిరిజన సంక్షేమ విద్యాసంస్థల్లో శిథిలావస్థలో ఉన్న పాత భవనాలు, ఓవర్ హెడ్ ట్యాంకుల గురించి హెచ్‌ఎంలు వెంటనే నివేదికలను డీడీ, డీటీడీఓలకు సమర్పించాలని ఆదేశించారు. భద్రతా సమస్యలపై నిర్మాణ స్థిరత్వ నివేదికను అంచనా వేయడానికి ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్‌తో సమన్వయం చేసుకోవాలన్నారు. వంటగది, మరుగుదొడ్లు, డార్మెంటరీ, తరగతి గదుల పరిశుభ్రతను హెచ్‌ఎంలు నిత్యం పర్యవేక్షించాలన్నారు. ఆర్‌ఓ ప్లాంట్లు మరమ్మతులకు గురైతే వెంటనే చేయించాలని డీడీని ఆదేశించారు. డార్మెంటరీలలో ఫ్యాన్లు ఉండేలా చూడాలన్నారు. హెచ్‌ఎంలు ఏదైనా అవసరాల కోసం సంబంధిత ఏఈతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. వారం రోజుల్లో అన్ని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో తనిఖీలు ఉంటాయని తెలిపారు. పీఓ వెంట చుంచుపల్లి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం శాంతకుమారి, బ్రాహ్మణపల్లి హెచ్‌ఎం శ్రీనివాస్ ఉన్నారు.



చుంచుపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినితో మాట్లాడుతున్న పీఓ చిత్రామిశ్రా



బ్రాహ్మణపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో నీటి కుళాయిలను పరిశీలిస్తున్న పీఓ

అవినీతిని ప్రశ్నిస్తున్న వారిపై అక్రమ కేసులు



ఏసీపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హన్మకొండ: హాస్టల్‌లో జరిగే అవినీతిని ప్రశ్నిస్తున్న విద్యార్థి సంఘ నాయకుడిపై అక్రమ కేసులు నమోదు చేయించడం సమంజసం కాదని పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొగిళి వెంకట్ రెడ్డి, కార్యదర్శి బి.నరసింహారావు అన్నారు. ఈ మేరకు మంగళవారం హనుమకొండలోని తన కార్యాలయంలో ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డిని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాషబోయిన సంతోష్‌పై అక్రమంగా నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై సమగ్ర విచారణ చేయాలని కోరారు. వేల్పుల చరణ్, మాలోత్ రాజేష్ నాయక్, వినయ్, రాజేష్, రాకేష్ పాల్గొన్నారు.

కేవీకే సేవలు వినియోగించుకోవాలి

కరీమాబాద్: రైతులు కృషి విజ్ఞాన కేంద్రం సేవలను సద్వినియోగం చేసుకోవాలని మామునూరు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.రాజన్న అన్నారు. మామునూరులోని పి.వి నరసింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని కేవీకేలో తెల్ల చేపల పెంపకంలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై ఐదు రోజులు నిర్వహించనున్న శిక్షణ తరగతులను మంగళవారం ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణలో చేపల పెంపకం పెరిగిందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ రవీందర్, డాక్టర్ గణేష్, డాక్టర్ రాజు, డాక్టర్ శశాంక్, డాక్టర్ సాయికిరణ్, పాల్గొన్నారు.

జేఎల్‌ఎం నియామక పత్రాల అందజేత

హన్మకొండ : జూనియర్ లైన్‌మెన్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు అందించారు. టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో 2018లో 2,553 జూనియర్ లైన్‌మెన్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఇందులో ఉమ్మడి వరంగల్ సర్కిల్‌లో 575 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాత పరీక్షలో సాధించిన మెరిట్ మేరకు పోస్టుకు ఒక్కరిని చొప్పున పోల్ టెస్ట్‌కు పిలిచారు. ఇందులో అర్హత సాధించగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో 69 పోస్టులు ఖాళీగా మిగిలాయి. అయితే మిగిలిన పోస్టులను ఆ తర్వాత ర్యాంకు సాధించిన అభ్యర్థులతో భర్తీ చేయాలని అభ్యర్థులు కోర్టుకు వెళ్లగా వారికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్ సర్కిల్ భర్తీలో మిగిలిన 69 పోస్టుల భర్తీకి రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం పోల్ క్లయింబింగ్ టెస్ట్‌కు అభ్యర్థులను పిలిచారు. పోస్టుకు ఒక్కరి చొప్పున ఇప్పటి వరకు మూడు దఫాలు టెస్ట్‌కు పిలవగా 48 మంది అర్హత సాధించారు. జిల్లాల పునర్విభజనతో ఉమ్మడి కరీంనగర్ సర్కిల్‌లోని మండలాలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో కలిశాయి. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అర్హత సాధించిన నలుగురిని ఉమ్మడి వరంగల్ సర్కిల్‌కు కేటాయించారు. ఈ మేరకు మంగళవారం రాత్రి ఉమ్మడి వరంగల్ సర్కిల్‌కు చెందిన 48 మంది, కరీంనగర్ నుంచి వచ్చిన నలుగురితో పాటు మొత్తం 52 మందికి నియామక పత్రాలు అందించారు. ఇందులో జనగామ జిల్లాకు 10 మందిని, హనుమకొండ జిల్లాకు 9, మహబూబాబాద్ జిల్లాకు 14, వరంగల్ జిల్లాకు 17, భూపాలపల్లి జిల్లాకు ఇద్దరిని కేటాయించారు.

కీర దోస.. రైతుకు భరోసా

- తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం
- వేసవిలో అనువైన పంట
- యాజమాన్య పద్ధతులు పాటిస్తే చక్కని ఆదాయం



వెర్రి తెగులు ఆశించిన కీర దోస




బూడిద తెగులు సోకిన మొక్క



ఆకుపై ఉన్న గుమ్మడి పురుగులు

కరీమాబాద్: వేసవిలో సాగు చేసే పంటల్లో కీరదోస కూడా ఒకటి. వానాకాలం వరి పంట కోసిన తర్వాత నీటి సౌకర్యం ఉన్న రైతులు కీర దోస సాగు వైపు మక్కువ చూపుతున్నారు.



తక్కువ పెట్టుబడి.. ఎక్కువ లాభం వస్తుంది. దీంతోపాటు కీర దోస వినియోగం కూడా పెరగడంతో రైతులు వందల ఎకరాలలో సాగు చేస్తున్నారు. అయితే సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తూ చీడపీడల నివారణకు జాగ్రత్తలు తీసుకుంటే చక్కని ఫలితాలుంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

కీర దోసను ఆశించే పురుగులు– నివారణ చర్యలు

గుమ్మడి పెంక పురుగు..

ఈ పురుగులు కీర దోస మొలకెత్తిన తర్వాత వచ్చిన లేత పత్ర దళాలను ఆశించి పంటను తీవ్రంగా నష్ట పరుస్తాయి. తీగ పాకు సమయంలో ఆశించి ఆకులకు నష్టం చేస్తాయి. నివారణ కోసం ట్రైక్లోఫోరాన్ పొడి మందును చల్లడంతోపాటు డైక్లోరోవాస్, ట్రైకోఫోరాన్ మందును మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

పండు ఈగ..

తల్లి ఈగలు పూత మొగ్గలపై, లేత పిందెలపై గుడ్లు పెట్టగా వీటి నుంచి వచ్చిన సన్నని పిల్ల పురుగులు కాయను తొలచి లోపలి గుజ్జును తిని నష్టపరుస్తాయి. దీంతో కాయలు కుళ్లిపోతాయి. నివారణకు మలాథియాన్, ప్రొఫెనోఫాస్ మందులు పిచికారీ చేయడంతోపాటు విషపు ఎరలను వేయాలి.

పాము పొడ పురుగు..

ఇది గొంగళి పురుగు. చాలా సన్నగా ఉండి ఆకు పై పొరలలో చొచ్చుకుని పోయి పత్రహరితాన్ని తిని నష్టపరుస్తుంది. నివారణ కోసం మలాథియాన్, ఆక్సీడెమటాన్‌మిథైల్, ఫిప్రోనిల్ లాంటి మందులు చీడల ప్రారంభ దశలోనే పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

కీర దోసను ఆశించే తెగుళ్లు– నివారణ పద్ధతులు

బూజు తెగులు..

ఆకు అడుగు భాగంలో బూజు మాదిరి ఏర్పడి తెగులు ఉధృతి ఎక్కువైతే ఉదారంగు మచ్చలు అడుగున, ఆకు పై పసుపు రంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు మాంకోజెబ్ , సిమోగ్జానిల్ పొడి మందులు మోతాదు ప్రకారం మార్చి మార్చి పిచికారీ చేయాలి.

బూడిద తెగులు..

ఆకుపై భాగంలో తెల్లని పొడిలా ఏర్పడి తెగులు ఉధృతి ఎక్కువైతే కాండం, పూతకు కూడా వ్యాపిస్తుంది. ఆకులు, కాండం ఎండిపోతాయి. నివారణ కోసం కేరథేన్, థయోఫనేట్ మిథైల్, బినామిల్ లాంటి పొడి మందులు పిచికారీ చేయాలి.

ఆకు మచ్చ తెగులు..

ఆకుల మీద చిన్న గుండ్రని మచ్చలు ఏర్పడతాయి. తెగులు ఉధృతి ఎక్కువైతే ఇవి పెద్దగా మారి ఎండిపోయి రాలిపోతాయి. కాయను ఆశించినప్పుడు నష్టం వాటిల్లుతుంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్, జినెబ్ పొడి మందులు పది రోజుల వ్యవధిలో రెండు దఫాలు పిచికారీ చేయాలి.

4. వెర్రి తెగులు..

ఆకుల్లో ఈనెలుండే ప్రాంతంలో చారలు ఏర్పడతాయి. మొక్క మొత్తం గడుసు బారి పూత తగ్గుతుంది. నివారణకు ఈ తెగులు సోకిన మొక్కలను నాశనం చేయాలి. డైమెథోయేట్, ఆక్సీడెమటాన్, ఫిప్రోనిల్, ఇమిడాక్లోప్రైడ్ లాంటి మందులు మోతాదు ప్రకారం పిచికారీ చేయాలి.

రైతులు పంటను పరిశీలిస్తుండాలి..



రైతులు వేసవిలో కీర దోస సాగు చేస్తే మంచి లాభాలు పొందొచ్చు. పెట్టుబడి తక్కువ ఉంటుంది. అందుకే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుంది. మొక్క దశ నుంచి పంటను జాగ్రత్తగా పరిశీలిస్తుండాలి. తెగుళ్లు, చీడపీడలు ఆశిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ అధికారులను సంప్రదించి వారి సలహాలు, సూచనల ప్రకారం మందులు పిచికారీ చేయాలి.

-డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

వరంగల్‌లో 'వందే భారత్'కు స్వాగతం



రైలుకు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు రఘునారెడ్డి, సతీష్, అధికారులు

కాశిబుగ్గ : సికింద్రాబాద్, విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించే రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకు మంగళవారం వరంగల్ రైల్వే స్టేషన్‌లో బీజేపీ నాయకులు, రైల్వే అధికారులు స్వాగతం పలికారు. అహ్మదాబాద్ నుంచి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా రూ. 85 వేల కోట్లకు పైగా రైల్వే ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్, విశాఖపట్నం మధ్య రెండో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించారు. ఈ రైలు 11. 58 గంటలకు వరంగల్‌కు చేరుకోగా బీజేపీ నాయకులు పూలు చల్లుతూ స్వాగతం పలికారు. 5 నిమిషాలు అనంతరం జెడ్ఆర్‌యూసీసీ మెంబర్ ఏరుకుల రఘునారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కుసుమ సతీష్.. రైల్వే అధికారులతో కలిసి జెండా ఊపి సిగ్నల్ ఇవ్వగా రైలు విశాఖపట్నం బయలేదేరింది. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఓం ప్రకాష్ కోలారియా, పొట్టి శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు స్టేషన్‌లోని నాలుగో ప్లాట్ ఫాంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లో ప్రధాని మోదీ సందేశం, ప్రారంభోత్స కార్యక్రమాలను రైల్వే అధికారులు తిలకించారు. అనంతరం స్టేషన్‌లో 'వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్'లో భాగంగా ఏర్పాటు చేసిన మూడు స్టాల్స్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సీనియర్ డీఎంఈ స్వరాజ్‌కుమార్, డీఎస్‌టీ హేమంత్ కుమార్, ఏడీఈ రాజ్‌కుమార్, స్టేషన్ మేనేజర్ బాలరాజ్, సీసీఐ రాజగోపాల్, సీటీఐ రవికుమార్ ఆర్‌పీఎఫ్ సీఐ టీఎస్ఆర్ కృష్ణ, జీఆర్పీ సీఐ నరేష్, ఎస్సై వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆ తల్లిదండ్రుల ఆచూకీ తెలపండి

- ఎస్సై ఎన్ జీనత్‌కుమార్



అనిల్‌కుమార్ దేవి దంపతులు

గార్ల: తమ ఇద్దరు చిన్నారులకు పాలల్లో విషం కలిపి ఇచ్చి చంపిన తల్లిదండ్రుల ఆచూకీ తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్సై ఎన్ జీనత్‌కుమార్ మంగళవారం తెలిపారు. గార్ల మండలం అంకన్నగూడెం గ్రామానికి చెందిన పెండకట్ల అనిల్‌కుమార్, దేవి దంపతులు.. తమ ఇద్దరు కూతుళ్లు లోహిత, జస్విత‌కు 3 రోజుల క్రితం పాలల్లో విషం కలిపి ఇచ్చి చంపి పరారయ్యారు. అప్పటి నుంచి గార్ల, బయ్యారం పోలీసులు సంయుక్తంగా గాలింపు చర్యలు చేపడుతున్నారు. ఈ క్రమంలో ఆ తల్లిదండ్రుల ఆచూకీ తెలిసిన వారు సీఐ 87126 569740, ఎస్సై 87126 56974, మహబూబాబాద్ ఎస్‌డీపీఓ 87126 56904 సెల్ నంబర్లకు వెంటనే సమాచారం ఇవ్వాలని ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ శాఖలో మహిళల పాత్ర అద్వితీయం



మాట్లాడుతున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

హన్మకొండ: విద్యుత్ శాఖలో మహిళల పాత్ర అద్వితీయమని, ఆపరేషన్ విభాగంలో పనిచేస్తున్న వారి సేవలు వెలకట్టలేమని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలకు నిరంతరం సహకారం అందిస్తామన్నారు. మహిళలు అన్ని రంగాల్లో దూసుకెళ్తున్నారని, వారి సేవలు అభినందనీయమన్నారు. వీర వనితలు ఝాన్సీ లక్ష్మీ బాయి, రాణి రుద్రమాదేవిల పోరాట పటిమ ప్రతి మహిళలో ఉండాలన్నారు. కుటుంబం ,సమాజంతో పాటు దేశాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమన్నారు. మహిళలతోనే ఆరోగ్యవంత సమాజ నిర్మాణం సాధ్యమన్నారు. ఇన్‌చార్జ్ డైరెక్టర్లు బి.అశోక్ కుమార్, టి.సదర్‌లాల్, వి.మోహన్‌రావు, వి.తిరుపతి రెడ్డి, జీఎం అన్నపూర్ణ, మహిళా ఉద్యోగులు నాగరాణి, చైతన్య, స్వాతి, సునీత, గంగాజమున, కల్పన, లక్ష్మి, మధుమతి, కవిత, మాధురి, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



నగేశ్(ఫైల్)

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారం వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందారు. మృతుడి తల్లికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. స్థానికుల ప్రకారం.. సంగెం మండలం కృష్ణానగర్ (గొల్లపల్లి)కు చెందిన ఇమ్మడి నగేశ్(29) తన తల్లి పద్మను బైక్‌పై తీసుకుని వివాహ వేడుక నిమిత్తం హసన్‌పర్తి మండలం కేశవాపూర్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో ధర్మారం వద్ద బైక్‌ను వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో నగేశ్ అక్కడే మృతి చెందగా, అతడి తల్లిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. గీసుకొండ ఎస్సై వెంకన్న ఘటనా స్థలిని సందర్శించి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ముగ్గురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.



అజయ్ (ఫైల్)

నెక్కొండ: మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని వెంకటాపురంలో జరిగింది. ఎస్సై మహేందర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఒర్రె అజయ్ (26) ప్రైవేట్ వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆరు నెలల నుంచి వృత్తి వదులుకుని ఇంటి వద్దే ఉంటున్నాడు. ఉద్యోగం లేకపోవడంతో వివాహం కావడం లేదని మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11న రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం నెక్కొండకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భార్య కాపురానికి రావడం లేదని వ్యక్తి..

దంతాలపల్లి : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి.. ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన దంతాలపల్లిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మండల కేంద్రానికి చెందిన చీకటి చిన్న రాములు (48)కు సూర్యాపేట జిల్లా సందుపట్ల గ్రామానికి చెందిన సుజాతతో సుమారు 30 సంవత్సరాల క్రితం పెళ్లి జరిగింది. ఈ దంపతులకు ఇద్దరు కుమారులు రవి, రాజు, కూతురు రమ ఉంది. 15 సంవత్సరాల క్రితం దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో సుజాత తన ముగ్గురు పిల్లలను రాములు దగ్గరే వదిలి వెళ్లింది. అప్పటి నుంచి రాములు తన పిల్లలను పెంచి పెద్ద చేశాడు. ఇందులో ఓ కుమారుడు రవి, కూతురు రమకు వివాహం చేశాడు. ఈ క్రమంలో తన భార్య ఇప్పటికీ కాపురానికి రావడం లేదని రాములు వారం రోజుల నుంచి మనస్తాపానికి గురవుతున్నాడు. మంగళవారం గ్రామ సమీపంలోని వ్యవసాయ భూమిలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి కుమారుడి ఫిర్యాదు పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కరుణాకర్ తెలిపారు.



రాములు (ఫైల్)

కూలికి వెళ్లమని మందలించినందుకు మరో వ్యక్తి..

గార్ల: కూలికి వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్న భర్తను భార్య మందలించింది. దీంతో క్షణికావేశానికి గురైన భర్త.. గడ్డి నివారణ మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళవారం గార్ల మండలం సేరిపురంలో జరిగింది. ఎస్సై జీనత్‌కుమార్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన మూతి రాజు (50) 15 రోజుల నుంచి కూలీకి వెళ్లడం లేదు. పైగా భార్య, పిల్లల సంపాదనతో మద్యం సేవిస్తున్నాడు. దీంతో తన కూలి డబ్బుతో మద్యం తాగుతూ తిరుగుతున్నావని భార్య మందలించింది. దీనికి మనస్తాపం చెందిన రాజు గడ్డి నివారణ మందు తాగి ఇంటిపై నిద్రించగా కూతురు రేణుకు గమనించింది. వెంటనే క్షతగాత్రుడిని మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటనపై కూతురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎస్సార్‌లో ఇంటర్నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్



ఫెయిర్‌ను ప్రారంభిస్తున్న వీసీ దీపక్ గార్గ్

హసన్‌పర్తి: నగర శివారులోని ఎస్సార్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఫెయిర్-24 సదస్సు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఐడీపీ సంస్థ (ఆస్ట్రేలియా) సహకారంతో ఈకార్యక్రమం నిర్వహించారు. ఎస్సార్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ దీపక్ గార్గ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐడీపీ సంస్థ విద్యార్థులకు సేవలందిస్తూ, విదేశీ ఉన్నత విద్యకు తోడ్పడుతోందని చెప్పారు. ఈ సంస్థ దేశ వ్యాప్తంగా 800కు పైగా యూనివర్సిటీలతో భాగస్వామ్యం ఏర్పర్చుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థుల భవిష్యత్ రూపకల్పనకు ఈ సదస్సు తోడ్పడుతోందన్నారు. ఈసందర్భంగా ఉన్నత విద్యావకాశాల గురించి విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బీఎస్, ఎంఎస్, పీహెచ్‌డీ, పోస్ట్–డాక్ కోర్సుల గురించి వివరించారు. స్టూడెంట్ వీసా విధివిధానాలు, రుణాలు, ఇన్సూరెన్స్ వివిధ దేశాల్లోని ఉపాధి, విద్యావకాశాల గురించి తెలిపారు. ఎస్సార్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ అర్చనారెడ్డి మాట్లాడుతూ ఈ ఫెయిర్‌ను యూనివర్సిటీలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సదస్సులో అసిస్టెంట్ ప్రీతా చక్రవర్తి, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సహకార చట్టంపై అవగాహన ఉండాలి

- వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు

హన్మకొండ: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల డైరెక్టర్లు సహకార చట్టంపై అవగాహన కలిగి ఉండాలని వరంగల్ డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్ రావు అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల డైరెక్టర్లకు సహకార చట్టం, బైలాపై శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి ఆయా సంఘాల పాలక వర్గం కృషి చేయాలన్నారు. కేవలం రైతులకు రుణాలు ఇవ్వడమే కాకుండా బహుళార్థక సంఘాలుగా వివిధ రకాల వ్యాపారాలు చేస్తూ సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్ నుంచి వచ్చిన సహకార శిక్షణ సంస్థ అధ్యాపకులు డి.విజయశంకర్, సి.విజయ్ కుమార్ రెడ్డి సహకారం ముఖ్య ఉద్దేశం, సూత్రాలు, సహకార పరిమితి వ్యవస్థ, తదితర అంశాలపై డైరెక్టర్లకు అవగాహన కల్పించారు. సమావేశంలో బ్యాంక్ సీఈఓ ఎండీ. వజీర్ సుల్తాన్, డీజీఎం రోహిణి, సెక్షన్ మేనేజర్ నిహారిక పాల్గొన్నారు.

17న భగవద్గీత శ్లోకాల పోటీలు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు

వరంగల్ : ములుగు రోడ్డు సమీపంలోని సప్తగురు ధామంలో ఈనెల 17వ తేదీన రాష్ట్ర స్థాయి భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు శివానంద గురు కల్చరల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపిచంద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం గురుధామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొనడానికి ఇప్పటికే సుమారు 150 ఎంట్రీలు వచ్చాయన్నారు. పోటీల్లో పాల్గొనే వారితో పాటు వచ్చిన వెంట వారికి, భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ మరో సభ్యుడు బండారు సాయి నారాయణ తెలిపారు. మొదటి బహుమతి రూ.5,116, రెండో బహుమతి రూ.3,116, మూడో బహుమతి రూ.1,116 చొప్పున అందజేస్తామన్నారు. ఈ పోటీలో పాల్గొనే వారు సాయి నారాయణ సెల్ నంబర్ 98484–23133 వాట్సాప్ మెసేజ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ భగవద్గీత విశిష్టత గురించి తెలపడానికి ఈపోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు సోమ రామయ్య, తాటికొండ చక్రపాణి, గంది ఉమాశంకర్, నాయక్ అహ్మద్, వెంకటరమణ పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో నలుగురికి పదేళ్ల జైలు

మహబూబాబాద్ రూరల్ : గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన కేసులో నలుగురికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 4 లక్షల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి పసుపులేటి చంద్రశేఖరప్రసాద్ మంగళవారం తీర్పు ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి. 2020 డిసెంబర్ 10వ తేదీన ఆరుగురు వ్యక్తులు ఖమ్మం జిల్లా నుంచి మహబూబాబాద్ జిల్లా మరిపెడకు 50 కేజీల ఎండు గంజాయి రవాణా చేస్తున్నారు. ఈ క్రమంలో పోలీసులు మరిపెడ మండల కేంద్రం శివారులోని కాకతీయ కళాతోరణం వద్ద గంజాయిని పట్టుకున్నారు. ఈ ఘటనలో అప్పటి ఎస్సై సిరిసిల్ల అశోక్.. మరిపెడ మండలం బాల్య తండాకు చెందిన బానోత్ నవీన్, బానోత్ బాలు, గురప్ప తండాకు చెందిన బానోత్ వీరన్న, తండా ధర్మారం గ్రామానికి చెందిన గుగులోత్ రామకృష్ణ, ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం జల్లిపల్లికి చెందిన మట్ట ప్రసన్నకుమార్, అల్లి ప్రసాద్‌పై కేసు నమోదు చేశారు. అప్పటి మరిపెడ సీఐ సాగర్ కోర్టులో చార్జిషీటు దాఖలు చేయగా ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు పీపీ చిలుకమారి వెంకటేశ్వర్లు కోర్టులో వాదనలు వినిపించారు. కోర్టు లైజనింగ్ అధికారి, ఎస్సై వెంకటాచారి, ప్రస్తుత మరిపెడ సీఐ హత్తిరాం, ఎస్సై తాహేర్ బాబా ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారులు జటంగి రాజు, రావిశెట్టి యాకేష్.. సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఇందులో నలుగురిపై నేరం నిరూపణకాగా మరో ఇద్దరిపై కాలేదు. వాదనలు విన్న న్యాయమూర్తి.. నలుగురికి ఒక్కొక్కరికి పదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

గంజాయి స్మగ్లర్ల అరెస్టు

వరంగల్ క్రైం: గంజాయి స్మగ్లింగ్‌కు పాల్పడుతున్న ముగ్గురిని హనుమకొండ పోలీసులు అరెస్టు చేసినట్లు ఏసీపీ దేవేందర్‌రెడ్డి తెలిపారు. ఏసీపీ కథనం ప్రకారం.. ఎస్సై సతీష్ సిబ్బందితో కలిసి సోమవారం మధ్యాహ్నం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ దగ్గర వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో హనుమకొండ హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన జన్ను సతీష్‌పై అనుమానం వచ్చి తనిఖీ చేయగా 440 గ్రాముల గంజాయి లభ్యమైంది. దీనిపై సతీష్‌ను విచారించగా క్యాప్ అనే వ్యక్తితో కలిసి గత నెల 28న భద్రాచలంలో రూ. 10 వేల విలువైన గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపాడు. అనంతరం గంజాయిని ప్యాకెట్ రూపంలో చిన్నాల సాయి చరణ్, కత్తుల శివశంకర్‌కు రెండు ప్యాకెట్ల చొప్పున విక్రయించాడు. ఒక్కో ప్యాకెట్ రూ. 500 చొప్పున విక్రయించగా మిగతా సరుకు(1240 గ్రాములు)ను క్యాప్ ఇంటి వద్ద నిల్వ ఉంచాడు. దీంతో సరుకును స్వాధీనం చేసుకుని సతీష్, సాయిచరణ్, కత్తుల శివశంకర్‌ను అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. సీఐ సతీష్, ఎస్సై సతీష్ పాల్గొన్నారు.

నిందితుల్లో ఏడుగురు మైనర్లే?

సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి హత్య కేసులో సంచలన విషయాలు

- భార్య ప్రధాన నిందితురాలు..? హత్యలో పాల్గొన్న మరో ఇద్దరు యువకులు
- మైనర్లు అంతా ఇంటర్ చదువుతున్న వారే..
- భయపెట్టాలని రూ.లక్ష సుపారీ
- పోలీసుల అదుపులో నిందితులు

హసన్‌పర్తి: పదవీ విరమణ పొందిన సింగరేణి ఉద్యోగి హత్య కేసులో సంచలన విషయాలు వెలుగు చూసినట్లు తెలిసింది. ఈ హత్య కేసులో తొమ్మిది మంది వ్యక్తులు పాల్గొన్నట్లు ఇందులో ఏడుగురు మైనర్లుగా పోలీసులు గుర్తించారు. మరో ఇద్దరు మేజర్లు ఉన్నారు. ఆ ఏడుగురు మైనర్లు నగరంలోని వివిధ కళాశాలల్లో ఇంటర్ చదువుతున్నట్లు తెలిసింది. ప్రధాన నిందితురాలు హతుడి భార్యగా పోలీసులు నిర్ధారించినట్లు సమాచారం. నగరంలోని కుమార్‌పల్లికి చెందిన గజెల్లి పోశం (70)కు భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. 12ఏళ్ల క్రితమే పోశం పదవీ విరమణ పొందాడు. ఇద్దరు కూతుళ్లకు వివాహాలయ్యాయి. ఆస్తి విషయంలో భర్త పోశంతో భార్య లక్ష్మికి గొడవలు జరుగుతున్నట్లు తెలిసింది. కుమార్‌పల్లిలోని ఇంటిని అమ్మడానికి పోశం సిద్ధపడడంతో లక్ష్మి అడ్డుకుంటూ వచ్చేదని పోలీసుల విచారణలో వెల్లడైనట్లు సమాచారం. నాలుగు నెలల క్రితం భర్త పోశంతో గొడవ పడిన లక్ష్మి కరీంనగర్‌కు వెళ్లినట్లు సమాచారం. అప్పటినుంచి పోశం తన కూతుళ్ల వద్ద ఉంటున్నాడు.

లక్ష రూపాయలు సుపారీ?

తన భర్త పోశం ఇల్లు అమ్మకానికి పెడుతున్నందున, భయపెట్టాలని లక్ష్మి నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ మేరకు కరీంనగర్‌లో తాను ఉంటున్న ఇంటి పక్కన ఓ యువకుడితో లక్ష రూపాయలు సుపారీ కుదుర్చుకున్నట్లు తెలిసింది. ఒప్పందం కుదుర్చుకున్న ఆ యువకుడు ఈనెల 9న వరంగల్‌కు వచ్చాడు. తన స్నేహితుడిని కలిసి ఒప్పందం కుదిరిన విషయాన్ని వెల్లడించినట్లు తెలిసింది. వారిద్దరితోపాటు మరో ఇద్దరు మైనర్లు ఈ నెల 9న రాత్రి కుమార్‌పల్లిలోని పోశం ఇంటికి వెళ్లినట్లు పోలీసులు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఇల్లు అమ్మకం విషయం మాట్లాడుకుందామని చెప్పడంతో పోశం వారితో కలిసి బయటకు వచ్చినట్లు తెలిసింది. అక్కడినుంచి మరో ఐదుగురు మైనర్లు జత కలిసినట్లు సమాచారం. తొమ్మిది మంది కలిసి మద్యం తీసుకుని కోమటిపల్లి రైల్వే గేట్ సమీపంలోకి వచ్చి చిత్తుగా సేవించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం.

కాళ్లు చేతులు విరిచేయాలనుకున్నారు?

లక్ష రూపాయల సుపారీ తీసుకున్న వీరు రిటైర్డ్ ఉద్యోగి పోశం కాళ్లు, చేతులు విరిచేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. పోశంపై రాళ్లతో దాడి చేసి అక్కడినుంచి పరారైనట్లు తెలిసింది. కానీ అతను మరణించాడు. హతుడి కూతురునుంచి ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. భార్య లక్ష్మిపై అనుమానం వచ్చి తమదైన శైలిలో విచారించగా ప్రధాన నిందితురాలు గుర్తించారు. ఏడుగురు మైనర్లు ఈ హత్యలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. ప్రస్తుతం నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.